
జ్యోతి కథల పోటీలో ప్రత్యేకబహుమతి రు. 116 పొందిన కథ

# సంతోషం

జె. సుబ్బలక్ష్మి



రాత్రి పదకొండుగంటల సమయం. ఇరుగు పొరుగు ఇళ్ళల్లోవాళ్ళంతా అప్పుడే లైట్లార్పేసి పడుకున్నారు. కాని గోపాలం ఇంట్లో మాత్రం ఇంకా లైటు వెలుగుతూనే వుంది. అంత పెద్ద ఇంట్లో బిక్కుబిక్కుమంటూ తనొక్కడే ఒంటరిగా కాలం గడపడానికి చాలా కష్టంగా వుంది గోపాలానికి.

బయట వర్షం కుంభవృష్టిగా కురుస్తోంది. ఆకాశం ఉరుములు, మెరుపులతో నానా బీభత్సంగా వుంది. "ఈ వర్షం ఇలా ఇంకా ఎన్ని గంటలసేపు కురుస్తుందో ఎప్పుడు వెలుస్తుందో తెలీదు. తెల్లారేసరికైనా తగ్గిపోతే బావుణ్ను! అనుకున్నాడు.

అసలు మామూలుగా ఉన్నప్పుడైతే-వర్షం కురుస్తుంటే తనకు ఎంతో హాయిగా, ఆనందంగా ఉంటుంది. ఆ వర్షధారలను చూస్తూ గంటలు గంటలు గడిపేయాలనిపిస్తుంది. కాని ఈరోజు మాత్రం ఎందుకో అలా అనిపించడం లేదు, పైగా చిరాకనిపిస్తోంది.

ఏమైనా తెల్లారేసరికి ఈ వర్షం తగ్గిపోవాలి. లేకపోతే హేమ రాదు.

ఛ! తన పిచ్చిగాని వర్షానికి భయపడి రాకుండా వుంటుందా ఎక్కడైనా? ఆమె వస్తుంది, తప్పకుండా వస్తుంది. అలా అని మాటిచ్చింది కూడా. వచ్చి తడివేళ్ళతో సుతారంగా తలుపు తడుతుంది. తను వెంటనే తలుపు తీస్తాడు. గుమ్మందగ్గర ఒక్క క్షణకాలం ఆగి, తడిసిపోయిన పైటకొంగును సర్దుకుంటూ అడుగులు తడబడుతుండగా లోపలికి వస్తుంది హేమ. వీధితలుపు గడియ పెట్టేసి తనూ ఆమె వెనకాలే ఇంట్లోకి వస్తాడు....

అదంతా రేపు తెల్లవారిన తరువాతి మాట! అసలీ రాత్రి గడచి తెల్లారుతుందా అని? ఇంకా పన్నెండయినా అవలేదు. పడుకుంటే నిద్దర రావడం లేదు. ఏంచేయాలో తోచడంలేదు, ఏం చేయడానికి పాలుపోవడంలేదు.

గోపాలం సిగరెట్టు వెలిగించాడు. గట్టిగా దమ్ము పీలుస్తూ గదిలో పచార్లు చేయడం మొదలెట్టాడు.

అసలు నిజంగా చూస్తే ఈరాత్రి తనకు బాగా నిద్రపట్టాలి. ఇన్నాళ్లూ అనుభవించిన నరకయాతననుండి విముక్తి కలిగినందుకు సంతోషించి హాయిగా, సుఖంగా ఆదమరచి నిద్రపోవాలి. తన జీవితంలోని అతి ముఖ్యమైన సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోగలిగినందుకు - తనదారిలో వున్న ముల్లును తొలగించుకోగలిగినందుకు-తన పాలిటి శనిగా దాపురించిన నాలుగేళ్ల క్షుద్రవెధవ బెడద వదిలించుకోగలిగినందుకు - ఈ రోజు అతి నిశ్చింతగా నిద్రపోవాలి. కాని ఏదీ...కునుకంటూ పడితేగా!

గోపాలం కళ్ల ముందు నాలుగేళ్ళ పసివాడు మెదిలాడు. వాడు మరెవరో కాదు, తన కొడుకు మురళి.

—మంచం మీద హాయిగా నిద్రపోతున్న మురళిని భుజాన వేసుకుని తీసుకెళ్లి తులసత్తయ్యకు అప్పజెప్పి వచ్చేశాడు. కాని ఆ అప్పజెప్పడం అంత సులభంగా జరిగిందా? లేదు. తన భుజం మీది కుదుపుకు నిద్రలేచిన వాడు దారిపొడుగునా ఒకటే ఏడుపులంకించుకున్నాడు. దారినపోయే వాళ్ళంతా తనకేసి అదోలా చూస్తూంటే తనకు తల తీసేసినట్టయింది. సొంత తండ్రి భుజం మీద వుండి కూడా తననెవడో బూచాడు ఎత్తుకు పోతున్నట్టు వాడలా గుక్కపెట్టి ఏడుస్తుంటే చెప్పలేనంత కోపం వచ్చింది వాడి మీద. వెంటనే గట్టిగా రెండు తగిలించాడు. అంతే, వాడి రాగాలాపన ఆగిపోయింది. కాని వెక్కిళ్లు మాత్రం ఆపలేదు.

కాసేపటికి ఆ వెక్కిళ్ళ మధ్యే అడిగాడు:

"నాన్నా...మనం ఎక్కడికెళుతున్నాం నాన్నా....?"

"ఎక్కడికా?...వల్లకాట్లోకి! నోరుమూసుకుని భుజం మీద పడుకో. ఇక నుంచీ నువ్వు మళ్ళీ అమ్మమ్మగారింట్లోనే వుండాలి. తెలిసిందా? పేచీ పెట్టావంటే చంపేస్తాను జాగ్రత్త!"

"ఊహుఁ...నేను రాను నాన్నా. వాళ్ళింట్లో వుంటాను."

వాడి మాటలు పట్టించుకోకుండా ముందుకు సాగిపోతూనే వున్నాడు తను.

తులసత్తయ్యగారిల్లు దగ్గరపడుతున్న కొద్దీ మురళి తన మెడను గట్టిగా యింకా గట్టిగా వాటేసుకున్నాడు. వాడి పట్టు వదిలించుకునే సరికి తల ప్రాణం తోకకొచ్చినంత పనయింది. ఎలాగో అతి కష్టం మీద వాణ్ణి తులసత్తయ్యకు అప్పగించాడు.

అంత రాత్రివేళ వాణ్ణలా తీసుకెళ్ళినందుకు ఆవిడకు కంగారు, ఆశ్చర్యం, అనుమానం—అన్నీ ఒకేకాలంలో కలిగాయికాబోలు, తనవంక ప్రశ్నార్థకంగా చూసింది.

అంతలో మురళి తిరిగి తన దగ్గరికే వచ్చేశాడు.

"నాన్నా....నేనిక్కడుండను నాన్నా... నీతో వస్తా నాన్నా..." అంటూ తన కాళ్ళను పెనవేసుకున్నాడు.

తనకు కోపం ఆగలేదు. వెంటనే వాడి చెంప ఛెళ్ళుమనిపించాడు.

కెవ్వుమన్న వాణ్ణి దూరంగా తోసి తులసత్తయ్యకేసి తిరిగాడు.

"అత్తయ్యా....నీతో అన్ని విషయాలూ ముందే మాట్లాడానుకదా!....పసితనంనుంచీ నువ్వే పెంచావు వీణ్ణి. అలాగే ఇంకొన్నాళ్ళపాటు నీదగ్గరే వుండనీ. ఖర్చులకు నెలనెలా డబ్బు పంపిస్తూనే వుంటాను. ప్రస్తుతం ఇది వుంచండి" అంటూ జేబులోంచి ఒక వంద రూపాయల నోటు తీసి ఆవిడ చేతిలో పెట్టాడు.

ఆ నోటు అందుకుంటూంటే తులసమ్మగారి చేతులు వణికాయి. చెమ్మగిల్లిన కళ్ళను పైట చెంగుతో అద్దుకుని తనవంక కృతజ్ఞతగా చూసింది.

ఆవిడ తనకు దూరపు బంధువు. తన తండ్రికి చెల్లెలి వరసవుతుంది. భర్త లేడు. కొడుకున్నా వాడివల్ల కష్టనష్టాలే తప్ప సుఖసంతోషాలు లేవు. అందువల్ల ఆవిడకి అడపాదడపా డబ్బుసాయం చేసే తనంటే ఎంతో ఇష్టం.

తను చెప్పిన పనిని కిమ్మనకుండా చేసేటంతటి కృతజ్ఞతాభావం! అందుకే తను చెప్పిన వెంటనే మురళిని తనదగ్గరుంచుకోవడానికి ఒప్పుకుంది.

'హమ్మయ్య!' అనుకుని తను వెనుదిరగబోయేంతలో మురళి మళ్ళీ గబగబా డేకుతూంటూ వచ్చి "నాన్నా....", అంటూ తన కాళ్ళకు చుట్టుకుపోయాడు.

తనకు ఒళ్ళు మండిపోయి ఎక్కడపడితే అక్కడ ఎడాపెడా కొట్టడం మొదలెట్టాడు.

తులసత్తయ్య పరుగున వచ్చి విడిపించుకోకపోయినట్లయితే ఇంకా ఎంతగా కొట్టేవాడో?

వాళ్ళింట్లోంచి బయటికొచ్చి వీధిలో నడుస్తున్నా ఎంతోదూరంవరకూ వాడి ఏడుపు వినిపిస్తూనేవుంది.

ఆకాశంలో మబ్బులు దట్టంగా అలుముకుపోయి, ఉరుముడం ప్రారంభించగానే తను నడకవేగం హెచ్చించాడు. అసలే మనసంతా ఉద్వేగంగా వుంది. దానికితోడు వర్షం కురుస్తుందేమోనన్న భయంకూడా కలిసి తనను నిముషాలమీద ఇంటికిచేర్చింది. అంతవేగంగా, అంతత్వరగా ఎప్పుడూ నడవలేదు తను.

ఇంటికి వచ్చి చేరాడో లేదో పెద్దపెట్టున వర్షం ప్రారంభమైంది. అప్పటినుంచి ఇప్పటివరకూ ఇంకా కుండపోతగా కురుస్తూనేవుంది. తన మనసుకూడా ఆకాశంలాగే అల్లకల్లోలంగా తయారయి, ఆలోచనలు తనను వెంటాడి నిద్రపట్టకుండా చేస్తున్నాయి...

గోపాలం పచార్లు ఆపి సిగరెట్టు పీకని అవతల పారేశాడు. నోరంతా దాహంతో ఎండిపోయినట్లనిపించి, మంచినీళ్ళు తాగుదామని వంటగదికేసి నడిచాడు. దారిలో కాలికింద మెత్తని పదార్థమేదో తగిలి కీచుమంది. ఉలిక్కిపడి లైటువేశాడు. గోపాలం వంగి ఆ వస్తువును చేతిలోకి తీసుకుని చూశాడు—ఆది మురళికి చాలా ఇష్టమయిన రబ్బరు బొమ్మ. బొద్దుగా ముద్దులొలికేలావున్న ఆ బొమ్మ కాస్తా ఇప్పుడు తనకాలి బరువుకు నొక్కుకుపోయింది. ముక్కు లోపలికి పోయి మొహం వంకరగా తయారైన ఆ బొమ్మను చూస్తూంటే మురళి మళ్ళీ మళ్ళీ గుర్తుకొచ్చాడు. తమకు పుట్టబోయేబిడ్డ రబ్బరు బొమ్మలా బొద్దుగా, అందంగా, ఆరోగ్యంగా వుండాలని తనూ, శ్యామలా ఎన్నెన్నో కలలు కన్నారు. కాని, చివరకు పుట్టిందేమో ఈ నొక్కుకుపోయిన బొమ్మలాంటి వికృత రూపంలో వున్న కొడుకు. ఎడమకాలును లాగిలాగి వేస్తూ, నోట్లోంచి చొంగకారుస్తూ, మెడ వేలాడేసుకుని నెమ్మదిగా నడిచివచ్చే మురళిని చూస్తే జాలితోబాటు జుగుప్సకూడా కలగడం సహజం. కళ్ళు రెండూ మెల్లకాబట్టి వాడు ఎటు చూస్తున్నాడో ఎవరికీ అర్థంకాదు. తమలాంటి చక్కని అందమైన జంటకు పుట్టిన పిల్లవాడంటే ఎవరూ నమ్మరు. ఎవరిమాటో ఎందుకు, తనే నమ్మలేదు మొదట.

చూట్టానికలా వున్నా తెలివితేటలు మాత్రం అమోఘంగా వున్నాయి వాడికి. తను బయటికి వెళ్ళేటప్పుడల్లా 'నేనూ వస్తా'నని మారాం చేసేవాడు.

వాడి పోరుపడలేక ఎప్పుడైనా ఓసారి వాణ్ణి బజారు తీసుకెళ్ళేవాడు తను. ఇంకేముంది దారినపోయేవాళ్ళందరి చూపులూ వాడిమీదే. కాస్త పరిచయమున్నవాళ్ళయితే ఒకటే ప్రశ్నలు! "మీ అబ్బాయా? పాపం! ఎప్పట్నుంచీ ఇలా వున్నాడు? ఎక్కడైనా చూపించారా? వాళ్ళేమన్నారు?"

"ఊహుఁ....వీడిక బాగవడు. వీడిగతి ఇంతే" అని అరిచి చెప్పాలనిపించేది తనకు. మురళిని చూపించని డాక్టరు లేడు. ఇప్పించని ట్రీట్‌మెంటులేదు. అంతా తన కర్మ! నలుగురిలోనూ పరువు తీయడానికే పుట్టుకొచ్చాడు వెధవ! వాణ్ణి చూసిన వాళ్ళందరూ ఎక్కడలేని సానుభూతి ఒలకబోసారు, తన మీద జాలి కురిపిస్తారు. అంతటితో ఊరుకుంటారా? ఊహుఁ...వేవేవో ఉచిత సలహాలిచ్చి తననీ వాణ్ణీ ఉద్ధరిస్తున్నట్లు పోజు పెడతారు. అది భరించడం తనవల్లకాదు. అందుకే ఒకరోజు-ఇక చచ్చినా మురళిని ఎక్కడికీ తీసుకెళ్ళకూడదు అని గట్టిగా నిశ్చయించుకున్నాడు....



## రచయిత్రి పరిచయం

నివాసం : హైదరాబాదు. సామాన్య గృహిణిని.

18 సంవత్సరాలకు పైగా కథలు రాస్తున్నాను. వివిధ పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో పాల్గొనడం వల్ల యింత వరకు (ప్రథమ, ద్వితీయ తృతీయ, కన్సొలేషన్ బహుమతులు కలుపుకొని) 12 బహుమతులు లభించాయి. ఇవికాక చాలా కథలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి నేను రాసిన మూడు నవలల్లో ఒక నవలకు (మేరేజ్ డే) రెండవ బహుమతి లభించింది. నేను 18 సంవత్సరాల క్రితం రాసిన రెండవ కథ (వాసుదేవరావు)కు ప్రథమ బహుమతి నిచ్చి ప్రోత్సహించిన అప్పటి ఆంధ్రసచిత్ర వారపత్రిక సంపాదకులు కీ॥ శే॥ శివలెంక శంభుప్రసాద్‌గారికి నేనెప్పుడూ కృతజ్ఞురాలిని

నేను యిప్పటికీ కథల పోటీల్లో పాల్గొనడానికి కారణం—నేను రాసిన ప్రతి కథనూ పరీక్షకు పెట్టాలనే!

నా 'సశేషం' కథకు ప్రత్యేక బహుమతినిచ్చి ప్రోత్సహించిన 'జ్యోతి' సంపాదకులకు కృతజ్ఞురాలిని.

గోపాలం చేతిలో వున్న బొమ్మనుదూరంగా విసిరేశాడు. గబగబా వెళ్ళి గ్లాసెడు మంచి నీళ్ళు గటగటా తాగేశాడు. అయినాఎందుకో దాహం తీరినట్టే అనిపించలేదు. ఇంకో గ్లాసు తాగాడు. తరువాత ఓ సారి చుట్టూ కలయ చూశాడు. ఇంట్లో ఎక్కడ చూసినా మురళి ఆట వస్తువులే. చిందర వందరగా పడివున్న వాటిల్లో ప్రతి ఆట వస్తువు వెనకా ఒక్కో జ్ఞాపకం ఇమిడి వున్నది ...

మురళి చాలా పెంకెఘటం. ఎక్కడికి తీసుకెళ్ళ కూడదనుకున్నా ఎప్పుడో ఒకసారి తీసుకెళ్ళక తప్పేది కాదు. అలా తీసుకెళ్లి నప్పుడల్లా ఏదో ఒక ఆటవస్తువు కొనందే ఊరుకునే వాడు కాదు. ఎంత నచ్చజెప్పినా, బుజ్జగించినా మంకుపట్టు వదిలే వాడు కాదు. ఇదుగో యిక్కడ పడివున్న ఎర్రకారు కొన్న ప్పుడూ అలాగే జరిగింది...


ఆ రోజు బొమ్మల షాపులో ఎర్రకారు చూసి అది కావాలని పట్టుబట్టాడు మురళి. 'ఇంటి నిండా ఆట వస్తువు లున్నాయి. ఇంకా ఎందుకు అనవసరంగా?' అని నచ్చజెప్ప బోయాడు కాని వాడు వింటేనా? షాపులోనే గొడవ చేయడం ప్రారంభించాడు. తనకు ఒళ్లు మండిపోయి నాలుగు అంటించాడు; చెవులు మెలేసి బుగ్గలు సాగదీశాడు. జబ్బ మీద గట్టిగా గిల్లాడు. అయినా వాడు తనపట్టు వద ల్లేదు: పెంకెతనం మానలేదు.

షాపులో వున్న వాళ్ళంతా తనకేసి ఉరి మిరిచి చూశారు. వాళ్ళ దృష్టిలో తనో రాక్షసుడు. పసివాడి కోరిక తీర్చని కిరాత కుడు. తనకు ప్రేమ, జాలీ ఏదీలేనట్టూ, అవన్నీ వాళ్ళల్లో పొంగిపొర్లి పోతున్నట్టూ తలోరకంగా ఉపదేశాలు మొదలెట్టారు. ఇక తప్పేదేముంది? ఎర్రకారును కొని బయటికి రాక తప్పలేదు. కాని అంత మంది ముందు తననో రాక్షసుడిలా నిలబెట్టి తనకు తల వొంపులు తెచ్చిందెవరు? ఓ వేలెడు వెధవ! ఆ కోపం కొద్దీ ఇంటికి తిరిగి వచ్చే టప్పుడు వాణ్ని ఎత్తుకోకుండా నడి పించుకునే తీసుకొచ్చాడు. దూరం నడిచే ఓపిక లేకపోయినా, ఎర్రకారును కొన్న సంతోషంలో పేచీ పెట్టకుండా కుంటు కుంటూ నెమ్మదిగా నడవసాగాడు మురళి. ఆ కారును గుండెలకు గట్టిగా అదుముకుని, మాటిమాటికీ దాన్ని చూసి మురిసిపోతూ వస్తున్న వాణ్ని వాడి మానాన వదిలేసి తను ముందుకు వడివడిగా నడుస్తూండిపోయాడు.

రోడ్డు క్రాస్ చేసేటప్పుడు కూడా వాడికి తకేసి పిలుంగానూ సహాయపడలేదు. తనను సతాయించినందుకు అదే శిక్ష వాడికి చచ్చి నటు నడిచిరానీ అనుకుంటూ అలాగే ముందుకు సాగిపోయాడు

"నాన్నా... నా చెయ్యి పట్టుకోనాన్నా.... నాకు భయమేస్తోంది" అని దీనంగా అడి గాడుకాని తనకుమాత్రం వాడిమీద ఏమాత్రం జాలి కలగలేదు సరికదా, వాడివైపు తిరిగైనా చూడకుండా ముందుకు నడుస్తూనే వున్నాడు. అంతలో కీచుమన్న బ్రేకుల శబ్దం వినిపించి చటుక్కున వెనక్కితిరిగి చూసాడు తను- రెండు బస్సులు, ఒక లారీ, ఒక కారు-అన్నీ సడెన్ బ్రేకుతో ఎక్కడివక్కడ ఆగి పోయాయి. డ్రైవర్లందరూ మురళివంక కోపంగానూ, తిరస్కారంగానూ చూస్తు న్నారు. అటూ ఇటూ వున్న షాపులవాళ్లూ, రోడ్డుమీద నడుస్తున్నవాళ్లూ వాణ్నే చూస్తు న్నారు. అయినా వాడుమాత్రం ఈ గందర గోళం ఏమీ పట్టించుకోకుండా తనమానాన తాను మెల్లి మెల్లిగా నడుస్తూ రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. జరగనున్న ప్రమాదం తల్చు కునేసరికి తన గుండె గుభేలుమంది. అంత క్రితం వున్న కోపమంతా ఏమయిందోగాని ఒక్క ఉదుటున పరుగెత్తుకెళ్లి మురళిని ఎత్తు కుని వచ్చేశాడు. అంతసేపూ ఊపిరి బిగపట్టు కున్నట్టు ఆగిపోయిన వాహనాలన్నీ మళ్ళీ కదిలి భరుమంటూ ముందుకు సాగిపోయాయి.

ఆ రోజు కొన్న ఎర్రకారే ఇది. గోపాలం దానివైపు చివరగా చూసి ఒక్క తన్ను తన్నాడు. దాన్నయితే తన్నాడుకానీ ఇంట్లో వున్న ప్రతి వస్తువూ వాణ్నే గుర్తుకుతెస్తోంది. వాణ్ని మరచిపోవటం తన సాధ్యం కావడం




లేదు. పోని లైటార్పేసే అవేవీ కనిపించవు కదా అనుకుంటూ స్విచ్చిమీద చెయ్యి వేయ బోయాడు. సరిగ్గా అప్పుడే అక్కడ వంకెకు తగిలించి వున్న నీలంరంగు స్వెట్టరువైపు మళ్లింది అతని దృష్టి. దాంతో స్విచ్చిదగ్గరి కెళ్లిన చెయ్యి అప్రయత్నంగా అలాగే వుండి పోయింది. ఈ స్వెట్టరంటే మురళికి ఎంతో ప్రాణం. బాగా పాతపడి, అక్కడక్కడ చిరిగి పోయిన ఈ స్వెట్టరు ఇప్పుడు తనకు పట్ట నంత చిన్నదయిపోయినా ఇప్పటికీ ఇదే తొడగమని పేచీ పెడతాడు. ఇప్పటి సైజులో కొత్తది కొనిపెట్టినా దాన్ని ఎప్పుడూ తొడు క్కోలేదు. ఇదంటే ఎందుకంత ఇష్టమో మరి!

చటుక్కున ఒక విషయం గుర్తుకొచ్చింది గోపాలానికి. దాంతోపాటు ఏవేవో జ్ఞాపకాలు పైకి తన్నుకొచ్చి కళ్లల్లో కన్నీళ్ళు చివ్వున ఉబికాయి. తడికళ్ళతో ఆ స్వెట్టరువంకే చూస్తూ నిలబడిపోయాడు కాసేపు.

అది శ్యామల, పుట్టబోయే తన బిడ్డ కోసం ఎంతో ప్రేమతో అల్లిన స్వెట్టరు. అప్పుడే కొత్తగా అల్లిక నేర్చుకుందేమో, ఆమె అను కున్న సైజు సరిగ్గా కుదరలేదు. పూర్తయిన తర్వాత దాన్ని చూసి తను నవ్వాపుకోలేక పడి పడి నవ్వాడు. అవకాశం దొరికినప్పు డల్లా ఆమెను వేళాకోళం చేసి ఉడికించడం మొదలెట్టాడు. అయితే శ్యామల చాలా తెలివి గలది. తను చేసింది పొరపాటని ఒప్పుకోక. కావాలనే అలా అల్లానని బుకాయించింది.

"అంటే నీకు పుట్టబోయేబిడ్డ ఇంత పెద్ద సైజులో రాకాసి పిల్లలావుంటుందన్నమాట!" అన్నాడు తనప్పుడు.

దాంతో ఆమెకు కోపం వచ్చేసింది. స్వెట్టరు తీసి మూలకు విసిరికొట్టి "నా జన్మలో ఇంకెప్పుడూ స్వెట్టరు అల్లను." అంది.

ఆ రోజు ఆమె ఏ దుర్ముహూర్తంలో ఆ మాటందోకాని అది నిజమైంది. మురళిని ఈ లోకంలోకి తీసుకొచ్చి తను మాత్రం ఏవో లోకాలకు వెళ్లిపోయింది...

గోపాలం కళ్ళు తుడుచుకున్నాడు. మనో నేత్రం ముందు అనాటి శ్యామల రూపం మెదులుతుంటే ఆ తీయని జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉండిపోయాడు.

శ్యామలకు ప్రసవం చాలా కష్టమయి చివరికి ఆపరేషన్‌చేసి తీయాల్సివచ్చింది బిడ్డని. పురిటి స్నానం వరకూ ఆమె బాగానే

వుంది. కాని తనకు పుట్టిన అనాకారి బిడ్డను చూసి అహర్నిశలూ కుళ్లి కుళ్లి ఏడవడంతో ఆమె ఆరోగ్యం దెబ్బతిని బాగా జబ్బు చేసింది. ఆమె జబ్బు నయం చేయించడానికి తనయితే శాయశక్తులా ప్రయత్నించాడు కాని ఆమె మాత్రం అదోరకమైన వైరాగ్యాన్ని పెంచుకుని వేళకు మందులు తీసుకోక నిర్లక్ష్యం చేసింది. ఓనాటికి పరిస్థితి విషమించి శ్యామల మరణించింది. ప్రాణం పోయేముందు ఆమె చెప్పిన మాటలు తన చెవుల్లో ఇంకా గింగిరుమంటూనే వున్నాయి.

"ఏమండీ పెళ్లయిన మూడేళ్లకే మన ముచ్చటతీరిపోయింది. మీతో కలకాలం కాపురం చేసే భాగ్యం నాకు లేకపోయింది... బాబుని మాత్రం నిర్లక్ష్యం చేయకండి. ఇలా పుట్టడంలో వాడి తప్పేముంది చెప్పండి... అదంతా మన కర్మ. అంతే! ఇన్నాళ్లలో మీరు ఒక్కసారికూడా వాడి వంక కన్నెత్తి చూడలేదు. ఇకముందు కూడా ఇలాగే జరిగితే నేను భరించలేనండీ. పసి వెధవ... వాడికేం తెలుసు....ఎంత కష్టంలో వున్నా సరే వాణ్ణి మాత్రం ఏమీ అనకండి. తల్లి ప్రేమ ఎలాగూ లేదు, కనీసం తండ్రి వాత్సల్యమన్నా వాడికి లభించేట్టు చూడండి. అసలు మామూలు పిల్లలకన్నా ఇలాంటి పిల్లలకే ఆదరణ, ఆప్యాయత ప్రేమ, వాత్సల్యం-ఎక్కువ అవసరమండీ... ఇలాంటి అనాకారి పిల్లాణ్ణికని మీ చేతుల్లో పెట్టి పోతున్నందుకు... నన్ను... క్షమించండి...!" అని ఏడ్చేసింది.

తన చేతులు పట్టుకుని ఆమె అలా దీనంగా అర్థిస్తుంటే తనకు దుఃఖం ఆగలేదు. కన్నీళ్ళ రూపంలో దుఃఖం పొంగి వస్తుంటే ఆమె చేయిమీద చెయ్యివేసి "బాబును జాగ్రత్తగా, నా ప్రాణంకన్న మిన్నగా చూసుకుంటాను. నువ్వేం దిగులు పెట్టుకోకు" అని మాటిచ్చాడు.

అది జరిగిన మర్నాడే శ్యామల వెళ్లిపోయింది. ఆమె లేని జీవితం తను ఊహించలేక పోయాడు. శ్యామల చాలా అందగత్తె, పైగా సహృదయురాలు. తనను ప్రాణాధికంగా ప్రేమించేది. అలాంటి భార్య లభించడం తన అదృష్టమని ఎప్పుడూ మురిసిపోతూ వుండేవాడు. అలాంటిది ఆమె తనను ఒంటరి వాణ్ని చేసి అలా అర్థాంతరంగా వెళ్లిపోయేసరికి తనకు పూర్తిగా మతిపోయినట్టయింది.

ఉయ్యాల్లో నిశ్చింతగా పడుకుని నిద్రపోతున్న పసివాణ్ని చూస్తూంటే కోపం, ద్వేషం రగిలేవి తనలో. వీడి మూలంగానే కదా తన శ్యామల తనకు లేకుండాపోయింది? వీడూ అందరు పిల్లల్లా లక్షణంగా పుట్టివుంటే శ్యామల కోరి మృత్యువును తెచ్చుకునేది కాదు. తండ్రిగా తాను కోరుకోకూడదుగాని' వీడేపోయి ఆమే బ్రతికుంటే ఎంత బాగుండేది అనిపిస్తూంటుంది ఒక్కోసారి. అలాంటి పిచ్చి ఆలోచన వచ్చినప్పుడల్లా వాడిమీద చెప్పలేనంత కసి పుట్టుకొచ్చేది.

ఇంట్లో సహాయంగా వుంటుందని వచ్చిన తులసత్తయ్య తన పరిస్థితికి జాలిపడి పిల్లవాణ్ని తన ఇంటికి తీసికెళ్ళింది.

నెల కొకసారి వాడి ఖర్చులకు డబ్బిచ్చి వస్తూండేవాడు తను. అలా వెళ్లినప్పుడల్లా ఆవిడ మురళిని తీసుకొచ్చి తన చేతుల్లో పెట్టబోయేది-ఎత్తుకోమని. ఆవిడ ఏమన్నా అనుకుంటుందేమోనన్న మొహమాటం కొద్దీ ఓసారి చేతుల్లోకి తీసుకుని మళ్లీ యిచ్చేసేవాడు. అంతేగాని ప్రేమగా పలకరించడంగాని, ఎత్తుకుని ముద్దాడడంగాని చేసేవాడు కాదు.

రోజులు నెమ్మదిగా గడిచిపోతున్నాయి. తనూ ఒంటరి తనానికి అలవాటు పడిపోయాడు. మురళి కూడా క్రమంగా పెరుగుతున్నాడు. కాని తనకూ వాడికీ మధ్య నున్న బాంధవ్యం మాత్రం అంటీముట్టనట్టు అలాగే వుండి పోయింది,

అది చూసిన తులసత్తయ్యకు ఆ బాంధవ్యం ఎక్కడ తెగిపోతుందోనన్న భయం పట్టుకున్నట్టుంది-అందుకనే నడకవచ్చే ఈడు రాగానే వాణ్ని తిరిగి తనకప్పగించేసింది. "బాబూ... పెద్దదాన్ని చెబుతున్నాను నా మాట విను. వీడు ఇక్కడే-నీకు దూరంగా వుండిపోతే నీమీద ఎప్పటికీ ప్రేమ ఏర్పడదు. కాస్త బుద్ధి తెలిసేసరికి తండ్రయినా దగ్గరుండకపోతే ఎలా చెప్పు?" అని మందలించి వాణ్ని ఇంట్లో దింపేసి వెళ్లిపోయింది.

ఇక చేసేదిలేక వాణ్ని చూసుకోవడానికి రామయ్య అనే ఒక మనిషిని కుదుర్చుకున్నాడు. రామయ్య మంచితనంవల్ల మురళి అతనికి త్వరగానే అలవాటుపడిపోయాడు.

మురళి "నాన్నా....నాన్నా ..." అంటూ తనదగ్గరకు కుంటుకుంటూ వచ్చేవాడు. తననలా పిలవాలని రామయ్యే నేర్పించివుంటాడు బహుశా....


—"నాన్నా" అన్న పిలుపు చెవిలో ప్రతిధ్వనించినట్టయి గోపాలం ఉలిక్కిపడ్డాడు. మురళి చిన్నారి చేతుల స్పర్శ ఇంకా కాళ్లకు తగులుతున్నట్టే అనుభూతి పొందాడు. తల గట్టిగా విదిలించి ఓసారి చుట్టూ కలయచూశాడు. ఇంట్లో ఎక్కడ చూసినా మురళి బట్టలూ, బొమ్మలూ, ప్రత్యేకంగా తయారు చేయించిన వాడి బూట్లూ కనిపిస్తున్నాయి. అవన్నీ కలిసి తనచుట్టూ చేరి వెక్కిరిస్తున్నట్టనిపించింది. మధ్యమధ్య "నాన్నా!... నాన్నా" అన్న పిలుపు కరుణాజనకంగా, ఆర్ద్రంగా వినిపించినట్టయింది.

గోపాలానికి తలతిరిగినట్టయింది. ఎవరినైతే దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాడో, ఎవరి ఉనికిని మర్చిపోవాలనుకుంటున్నాడో వాడి గురించిన ఆలోచనలతోనే తల మున్కలయిపోతున్నాడు ఇప్పుడు. అదే విచిత్రం! "కన్నకొడుకునలా చీదరించుకోవడం, దూరం చేసుకోవడం న్యాయమేనా? వాడి తల్లి బతికుంటే ఇది చూసి సహించేదా? సొంత కొడుకుని ద్వేషించి చీదరించుకునే తండ్రులు ఉంటారా ఎక్కడైనా?" అన్న ప్రశ్నలు ఉదయించాయి గోపాలం మనసులో.

వెంటనే "ఇందులో తన తప్పేముంది గనుక? తన స్థానంలో ఉన్నవాడెవడైనా ఇలాగే ప్రవర్తిస్తాడు." అని తనని తానే సమర్థించుకోడానికి ప్రయత్నించాడు.

మురళి ఉన్నంతవరకూ ఈ ఇంట్లో అడుగు పెట్టనని హేమ ఖచ్చితంగా చెప్పేసింది. మరి అలాంటప్పుడు వాణ్ని దూరంగా వుంచడం తప్ప మరేం చేయగలడు తను? తనదారి కడ్డంగా-ముల్లులాగా ఉన్న వాడి బెడద వదిలించుకుంటేతప్ప తనజీవితంలో సుఖశాంతులు లభించవు, హేమ తనభార్య కాలేదు; ఈ రెండేళ్ళుగా కరువైన మనశ్శాంతి తిరిగి తనకు లభించదు....

'అబ్బ! ఇక ఎక్కువగా ఆలోచించకూడదు.'



అనుకుంటూ లైటు ఆర్పి ముందు గదిలో కొచ్చాడు గోపాలం. మంచం మీద వెల్లకిలా పడుకొని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. అయినా నిద్ర మాత్రం అతని దరిదాపులకు కూడా రాలేదు. వర్షం ఎప్పుడు వెలుస్తుందా, ఈ రాత్రి ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూస్తూ అలాగే పడుకుని వుండి పోయాడు.

తెల్లవారితే హేమ వస్తుంది: ఇద్దరూ కలిసి పెళ్ళికి డేట్ నిర్ణయిస్తారు: ఆ పెళ్లి కాస్తా జరిగిపోతే హేమ తనదై పోతుంది: తనశ్యామల స్థానంలోకే రాబోతోంది హేమ.

శ్యామల పోయిన తరువాత హేమ తారసపడేదాకా యింకే అమ్మాయీ తనను ఆకర్షించలేదు. మొదటి రెండేళ్లూ శ్యామల వియోగంతో పిచ్చివాడిలా గడిపాడు తను. మళ్ళీ పెళ్లి అన్నమాటే తలపెట్టకూడదని గట్టిగా నిశ్చయించుకున్నాడు కూడా. బంధువులూ, మిత్రులూ మళ్లీ పెళ్లి చేసుకోమని ఎంత బలవంతం చేసినా తను వినలేదు.

కాని రానురాను ఒంటరితనం తనను కుంగదీస్తుంటే—ఇంట్లో బాధ్యతలు అంతకంతకూ పెరిగి బాధిస్తుంటే—తన నిర్ణయాన్ని మార్చుకోక తప్పలేదు అయినప్పటికి కక్కుర్తిపడి ఎవరో ఒకర్ని పెళ్ళాడ్డానికి తన మనసంగీకరించలేదు. ఏ అమ్మాయిని చూసినా ఆమెలో శ్యామలను చూడడానికి ప్రయత్నించి విఫలుడయ్యే వాడు. ఆమెను చూసిన తన కళ్ళకు యింకే అమ్మాయీ నచ్చలేదు. ఇంకో యిద్దరు ముగ్గురు తనకి నచ్చినా మొదటి సంగతి తెలిసి వాళ్ళు తనను నిరాకరించారు. 'అసలే తను రెండో పెళ్లివాడు. పైగా ఒక అవిటి కొడుకు కూడా వున్నాడాయె. అలాంటప్పుడు అందగత్తే కావాలని పట్టుబడితే ఎలా' అని బంధుమిత్రులంతా తననే విమర్శించే సరికి పెళ్లిపీదే విరక్తిపుట్టి తన కోసం ఎవర్నీ చూడక్కర్లేదని ఖచ్చితంగా చెప్పేశాడు. జీవితాంతం ఆమెతో కలిసిమెలిసి వుండవలసిన వాడు తనేగదా....ఎవరో ఒకరు తెమ్మని ఎలా సర్దుకుపోగలడు? ఈ విషయం వాళ్లెవరూ ఆలోచించినట్టు లేదు.

అందం, చదువు, మంచి ఉద్యోగం, కొద్దో గొప్పో డబ్బు అన్నీ వుండి కూడా ఒక్క అనాకారి కొడుకు మూలంగా తనకు అందమయిన భార్య దొరకడం అసాధ్యమయిందంటే ఇక అంతకన్నా అవమానం ఏముంటుంది? అందుకని ఆ ప్రయత్నాలే విరమించుకున్నాడు.

ఈలోగా తన ఆఫీసులో హేమ అన్న అమ్మాయి కొత్తగా ఉద్యోగంలో చేరింది. మంచి అందం, అణకువ, కలుపుగోలుతనం-అన్నీ వున్న ఆ అమ్మాయి అతి త్వరలోనే ఆఫీసులో అందరి మెప్పు సంపాదించింది. ఆశ్చర్యమేమిటంటే ఆమె దూరం నుంచి అచ్చు శ్యామలలాగే కనిపించేది. ఆ కళ్లు ముక్కు, నోరు, అన్నీ శ్యామలవే. ఆమె నడకతీరుకూడా కాస్త అటూ ఇటూగా శ్యామల నడకలాగే వుండేది. దాంతో తను త్వరగానే ఆమెపైపు ఆకర్షితుడయ్యాడు.

ఇద్దరిమధ్యా స్నేహం పెరిగింది క్రమంగా చనువుకూడా ఏర్పడింది. ఆమెతో మాట్లాడుతుంటే శ్యామలతో మాట్లాడుతున్నట్టే అనిపించి మనసు ఆనందంతో నిండిపోయేది. ఆమెకు కూడా తనంటే ప్రేమ, సానుభూతి వుందని తెలియడానికి అట్టే రోజులు పట్టలేదు. ఈసారి చేతికందివస్తున్న ప్రేమ భాండాన్ని ఏమైనా సరే వదులుకోకూడదన్న నిశ్చయానికి వచేశాడు తను. దాని కోసం ఏం చేయడానికైనా తను సిద్ధమే హేమతో తనకు మొదట పెళ్లయిందనీ, భార్య పోయిందనీ చెప్పాడుకాని ఒక కొడుకున్నట్టుకాని, వాడు అనాకారి అన్న సంగతికాని చెప్పలేదు. ఆమె గనుక పెళ్లికి ఒప్పుకుంటే ఆ తరువాత సమయం వచ్చినప్పుడు ఆ సంగతి చూసుకోవచ్చు అనుకున్నాడు. అయితే ఆ సమయం అంత త్వరగా అదీ పెళ్లికి ముందే వచ్చేస్తుందని మాత్రం అతననుకోలేదు. ఆ రోజు... హేమ హఠాత్తుగా ఇంటికొచ్చేసింది. అంతవరకూ ఎప్పుడూ ఆమెను తను ఇంటికి తీసుకురాలేదు రమ్మని ఆహ్వానించనూలేదు.



మొదటి బిడ్డకు అన్ని ఆప్యాయతలూ చూపండి




శారీరక, మానసిక వికాసానికి శిశువుకు మొదటి మూడేండ్లు చాల ముఖ్యం. మీ ప్రేమ, ఆప్యాయత అంతా ఆ శిశువుకు కావాలి.

మరో శిశువు కలిగితే మొదటి శిశువుకు మూడేండ్లు నిండేవరకు మీ శ్రద్ధాసక్తులు పూర్తిగా చూపలేరు.

పిల్లల మధ్య ఎడం ఉంచేందుకు మామూలుగా వాడే సాధనాలు

నిరోధ్, మాత్రలు లేదా లూప్

ఇంకా వివరాలకు అతి దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించండి

మీ మొదటి శిశువుకు మూడేండ్లు తదేక శ్రద్ధ చూపండి

davp 80/248

అలాంటిది ఆమె అంతట ఆమె ఇల్లు వెతుక్కుంటూ రావడంచూసి తను తెల్లబోయాడు. కంగారులో అసలు నోటమాట రాలేదు తనకు. కాని ఎలాగోలా సర్దుకుని ముఖంమీద నవ్వు తెచ్చుకుని లోపలికి రమ్మని ఆహ్వానించాడు.

కాసేపు అవీఇవీ మాట్లాడుకున్న తరువాత ఆమె పెళ్లి ప్రస్తావన తెచ్చింది.

తను సందేహిస్తూ కాసేపు మౌనంగా కూర్చుండిపోయాడు. ఆ తరువాత ధైర్యం తెచ్చుకుని "పెళ్లికిముందు నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి హేమా....! అన్నాడు.

హేమ కిలకిలా నవ్వింది.

"అయితే ఇంతకాలంగా మనం చేస్తున్నదేమిటో...?

"అలాకాదు హేమా....సీరియస్‌గా చెబుతున్నా....నీతో కొంచెం వివరంగా మాట్లాడాలి."

"అబ్బ! మాట్లాడకూడదూ? దానికంత తడబాటెందుకో....!" తేలిగ్గా నవ్వుతూనే అంది హేమ.

"అబ్బే....తడబాటుకాదు...."

నా మాట ఇంకా పూర్తి కానేలేదు, అంతలో లోపలినుంచి "నాన్నా...!" అన్న పిలుపు దూసుకొచ్చింది. ఆ పిలుపు వెనకాలే మురళికూడా మేమున్న గదిలోకి వచ్చేశాడు. మట్టిలో పడి పొర్లినట్టున్న మురికి బట్టలు, చాక్లెట్లు తింటూ చొక్కామీద కార్చుకున్న చొంగమరకలు. మెడ వేలాడేసుకుని ఎడమకాలును లాగిలాగి వేస్తూ కుంటుకుంటూ వాడలా గదిలోకొచ్చేసరికి తనకు అరికాలిమంట నెత్తికెక్కింది.

వెంటనే "రామయ్యా....!" అని ఇల్లంతా అదిరిపోయేలా ఒక్క కేక పెట్టాడు.

"వస్తున్నా బాబుగారూ" అంటూ పరుగెత్తుకొచ్చిన రామయ్యతో "వీణ్ణి గదిలోకి రానీయొద్దని నీకెన్నిసార్లు చెప్పాలి?" అని గద్దించాడు.

అతను గజగజా వణికిపోతూ "పొరపాటయిపోయింది బాబుగారూ....నేను వంటింట్లో టీ కలుపుతుంటే చిన్నబాబుగారు వచ్చేసినట్టున్నారు" అంటూ మురళిని తీసుకుని గబగబా అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు

హేమ వాళ్లు వెళ్లినవైపు జుగుప్సగా చూస్తూ "ఎవరండీ ఆ అబ్బాయి?" అని అడిగింది

"మా అబ్బాయే!" ఆ మాట అంటున్నప్పుడు తన తల భూమిలోకి కుంగిపోయినట్లయింది.

హేమ అదిరిపడింది "ఏమిటీ? మీ అబ్బాయా? మరి ఇన్నాళ్లూ ఈ సంగతి నాతో చెప్పనేలేదే?" అంది. అప్పటికే కోపం, అసహనం ఆమె గొంతులో తొంగి చూస్తున్నాయి.

"చెప్పాలనే అనుకున్నాను హేమా...." అని యింకా ఏదో చెప్పబోతున్న తనను మధ్యలోనే ఆపి 'ఇక చాలించండి మీ నాటకం. నన్ను మోసం చేయాలన్నదే మీ ఉద్దేశం కాకపోతే నా నుంచి యీ సంగతి ఎందుకు దాస్తారు? అదృష్టం కొద్దీ ముందే తెలుసుకున్నాను కాబట్టి సరిపోయిందిగాని లేకపోతే యింకేమన్నా వుందా? నిలువునా గోతిలోకి దిగేదాన్ని. మిమ్మల్ని పెళ్ళాడి యీ వెర్రి బాగులకుంటి కుర్రాణ్ని జీవితాంతం భరించే దాని కన్నా పెళ్లి చేసుకోకుండా యిలాగే వుండిపోవడం ఎంతో నయం." అంది ఆవేశంతో ఊగిపోతూ.

హేమను శాంతపరచి నచ్చజెప్పాలని ఎంతగానో ప్రయత్నించాడు. కాని ఆమె అసలు తన మాటలను వినిపించుకోలేదు. "మీరంటే నాకు ప్రేమ వున్న మాట నిజమే కాని ఆ ప్రేమ కోసం యింత పెద్ద త్యాగం చేయగల ఔదార్యం నాలో లేదు...నేను సామాన్య స్త్రీని. కట్టుకున్న భర్తతో సుఖంగా కలిసి జీవించాలన్న స్వార్థం నాలోనూ వుంది....కాబట్టిమీరు వేరే ఎవరినైనా చూసుకోవడం మంచిది..."





అని కుండ బద్దలుకొట్టినట్టు నిర్మొహమాటంగా చెప్పేసింది.

అయినా తను ఆశ వదులుకోలేక ఆమెను రకరకాలుగా ప్రాధేయపడడం ప్రారంభించాడు. మురళి వల్ల తనకే యిబ్బందీ కలక్కుండా చూసుకుంటానని హామీ యిచ్చాడు.

చివరికామె కొంచెం శాంతించి, "వాణ్ని యింకెక్కడైనా వుంచే ఏర్పాటు చేసినట్టయితే పెళ్లి చేసుకోడానికి నాకేం అభ్యంతరం లేదు." అని చెప్పింది.


తను ఆమె షరతుకు అంగీకరించాడు. మొదట్లో రెండేళ్ళపాటు వాణ్ని చూసుకున్న తులసత్తయ్య దగ్గరే యిప్పుడూ వుంచవచ్చని ఆలోచించి ఆమెను పెళ్లికి ఒప్పించాడు.

"అయితే రేపొద్దున్న నేనువస్తాను. ఈలోపు వాణ్ని పంపించేసినట్టయితేనే మన పెళ్ళి. అప్పటికి వాడిక్కడే వున్నట్టయితే నేనీ ఇంట్లోకి అడుగు పెట్టేదిలేదు." అని చెప్పి హేమ వెళ్ళిపోయింది.

మాట ప్రకారం ఈ రోజు మురళిని తులసత్తయ్యకు అప్పగించి వచ్చాడు. ఈ విధంగా తన రెండుసమస్యలూ తీరిపోయాయి అనుకున్నాడుగాని ఈ రాత్రి నిద్రపట్టక ఇలా అవస్థపడతాడని మాత్రం ఊహించలేదు....

గోపాలం పక్కకు తిరిగి పడుకున్నాడు. ఇక కొన్ని గంటల్లో తెల్లారిపోతుంది. తెల్లవారగానే హేమ వస్తుంది. ఇంట్లో మురళి లేకపోయేసరికి సంతోషపడిపోతుంది. ఆ తరువాత ఇద్దరూ కలిసి పెళ్లికి డేట్ నిర్ణయిస్తారు....

అసలు అప్పుడు మురళి తమ గదిలోకి రాకపోయినట్టయితే ఈ గొడవంతా లేకపోయేది. హేమ వెళ్లిపోగానే తను మురళిని చావబాదేశాడు. వాణ్నలా తన గదిలోకి వదిలినందుకు రామయ్యనూ బాగా కేకలేశాడు. రేపట్నుంచి అలాంటి బాధలేంవుండవు. ఇక ఎప్పటికీ తన యింటికి రాలేడు మురళి. తనూ హేమా హాయిగా, సంతోషంగా, అన్యోన్యంగా వుండొచ్చు.




హేమ అన్నమాటలో తప్పేముంది గనుక? ఆమె ఎంతైనా పెళ్లికాని ఆడపిల్ల. భవిష్యత్తును గూర్చి ఎన్నో బంగారుకలలు కనివుండొచ్చు ఆమె. అలాంటప్పుడు పరాయి పిల్లాణ్ని-అందులోనూ అవిటి పిల్లాణ్ని ప్రేమగా చూసుకోవలసిన అవసరం ఆమెకేమొచ్చింది? కన్నతండ్రి అయివుండి కూడా తనే చీదరించుకుంటున్నాడు వాణ్ని.

అయినా ఇందులో మురళిచేసిన తప్పు మాత్రం ఏముందని? వాడేమన్నా కావాలని కోరుకుని అవిటివాడుగా పుట్టాడా? లేదు. అలాంటప్పుడు వాడికి ఇంత ఘోరమైన శిక్ష విధించడానికి తనకేం హక్కుందని? కన్న కొడుకుమీద ఇంతటి అయిష్టతను ఏ తండ్రి అయినా పెంచుకుంటాడా అసలు? ఒకవేళ తనకే ఏ యాక్సిడెంటో జరిగి కాలో చెయ్యో తెగిపోయి అవిటివాడయివుంటే, శ్యామల తనను ఇలాగే నిర్లక్ష్యం చేసి వదిలేసేదా? తిరస్కారంగా చూసేదా? ఇప్పుడు తను మురళి పట్ల ఇంత కఠినంగా ప్రవర్తిస్తున్నందుకు వాణ్ణి ఇంట్లోంచి తరిమేసినందుకు ఆమె ఆత్మ ఎంత క్షోభపడుతోందో...తండ్రి ప్రేమకు వాణ్ణి దూరం చేయనని ఆమెకు మాటిచ్చాడు. కాని వాణ్ని ఏనాడూ ప్రేమగా దగ్గరికి తీసుకోలేదు. తన సుఖంకోసం, స్వార్థంకోసం ఒక అమాయక జీవిని ప్రేమ వంచితుణ్ణి చేశాడు. ఆ తల్లి మనసును నొప్పించి తను పొందగోరే జీవితంలో సుఖం లభిస్తుందన్న గ్యారంటీ ఏముంది?

హేమ తనకు ప్రశాంతమైన జీవితాన్నే ప్రసాదిస్తుందన్న నమ్మకం ఏమిటి? మరి నమ్మకంలేని ఆ సుఖసంతోషంకోసం ఆశపడి, ఒక లేత జీవితాన్ని మొగ్గలోనే మాడ్చి మసిచేయటం న్యాయమేనా! ఊహుఁ... అలా జరగడానికి వీల్లేదు... జరగనివ్వకూడదు.

గోపాలం దిగ్గునలేచాడు. కిటికీ దగ్గరికి నడిచి బయటికి చూశాడు. వర్షం తగ్గిపోయింది. మంద మందంగా చల్లగాలి శరీరానికి తాకుతోంది.

చటుక్కున ఒక నిర్ణయానికొచ్చినట్టు చకచకా బట్టలు వేసుకుని తలుపుకు తాళం పెట్టి తులసమ్మగారింటికి పరుగెత్తాడు.

అంత రాత్రివేళ అతనొచ్చి తలుపు తడితే ఆశ్చర్యపోతూ తలుపు తెరిచింది తులసమ్మ. కాని గోపాలం ఆవిడతో ఏమీ మాట్లాడకుండా తిన్నగా లోపలికెళ్ళి గాఢంగా నిద్రపోతున్న మురళిని ఎత్తుకుని భుజాన వేసుకున్నాడు. కుదుపుకు నిద్రలేచిన మురళి అంత దగ్గరలో తండ్రి మొహాన్ని చూడగానే భయంతో కెవ్వున కేకపెట్టాడు. అతని చేతుల్లోంచి తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ "నాన్నా....కొట్టకు నాన్నా...!ఇంకెప్పుడూ నీ గదిలోకి రాను.... పేచీలు పెట్టను." అని దీనంగా మొరపెట్టుకోసాగాడు.

అది చూసి గోపాలం హృదయం కరిగిపోయింది. కళ్ళల్లోంచి అశ్రువులు ధారకట్టి మురళి చెంపల మీద కారుతూండగా వాణ్ని గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు అతని ప్రవర్తన అర్థంకాక తులసమ్మ నోరు తెరుచుకుని చూస్తూండి పోయింది.

మురళిని తిరిగి తన ఇంటికితీసుకొచ్చాడు గోపాలం.

ం ం ం

మర్నాడు ఉదయం ఏడుగంటల వేళ-మబ్బుపీడిన ఆకాశంలోంచి లేలేత సూర్యకిరణాలు ఇంట్లోకి ప్రసరించి ఇల్లంతా వెలుగును నింపుతున్నాయి.

గోపాలం తనే స్వయంగా పాలుకాచాడు. పాలగ్లాసు, బ్రెడ్‌ముక్కలు డైనింగ్ టేబుల్ మీదుంచి మురళిని తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెట్టాడు. అయితే టేబుల్ చాలా ఎత్తుగా వుండి వాడికి పాలగ్లాసు అందకపోయేసరికి గోపాలం వాణ్ని ఒళ్లో కూర్చోపెట్టుకుని తనే తినిపించసాగాడు.

సరిగ్గా అప్పుడే తలుపుమీద టక్‌టక్‌మని చప్పుడయింది. గడియపెట్టని తలుపు తోయగానే తెరుచుకుంది. వెంటనే బయటినుంచి చల్లటి గాలి లోపలికి జొరబడి గోపాలం ఒళ్ళంతా గగుర్పొడిచింది తలతిప్పి చూశాడు, హేమ.

హేమ మురళిని చూడగానే ఆశ్చర్యం ఆపుకోలేక "ఇంకా వీడిక్కడే వున్నాడేం?" అని గట్టిగా అరిచింది.

గోపాలం మురళిని ఇంకా దగ్గరగా అదుముతుంటూ "అవును. ఇక్కడే వున్నాడు. వుంటాడుకూడా. వీణ్ని నేనెక్కడికీ పంపదల్చుకోలేదు" అన్నాడు.

హేమ కళ్ళల్లో కోపం పెల్లుబికింది. ఆమె ఏదో అనేలోగానే గోపాలంమళ్ళీ శాంతస్వరంతో చెప్పాడు: "నేను బతికున్నంతకాలమూ మురళి నాదగ్గరే వుంటాడు. హేమా...బాగా ఆలోచించుకో... ఇంకా గడపమీదే నిలబడివున్నావు. అడుగు లోపలికి వేయాలో, బయటికో నువ్వే నిర్ణయించుకో...!"


అనుకోని ఈ పరిణామానికి విస్తుపోయింది హేమ. జవాబు ఏం చెప్పాలో తెలియక తికమక పడిపోయింది.

గోపాలం కాసేపు మౌనంగా ఆమెనే చూస్తూండిపోయాడు. ఆమె లోపలికి రాదని అతనికెలాగూ తెలుసుకాబట్టి నిర్వికారస్వరంతో అన్నాడు : "ఎందుకలా తటపటాయిస్తావు హేమా?....వెళ్ళదల్చుకుంటే తలుపు దగ్గిరికి చేరవేసి వెళ్ళు."

కోపం, ఆవేశం, అవమానం, నిరాశ-ముప్పిరిగొనగా గిరుక్కున వెనక్కితిరిగి వెళ్ళిపోయింది హేమ. ✱








శేఖరం గుమ్మందగ్గరికి వచ్చేసరికి కోటేశ్వరరావూ, సరోజినీదేవి దిగేరు. జ్యోతి దిగుతోంది

వాళ్ళను చూసి తెల్లబోయాడు. వెనతిప్పి వెనకాలే వస్తున్న తల్లితో "హైదరాబాదు నుంచి కోటేశ్వరరావుగారూ వాళ్ళూ వచ్చేరు" అని వాళ్ళకి ఎదురు వెళ్ళాడు. కూడా బావి వున్నాడు.

"ఎప్పుడొచ్చారూ" నవ్వుతూ పలకరించేడు. పైకి నవ్వుతున్నాడేగాని వాళ్లు రాకూడని సమయంలో వచ్చినట్టుగా ఇబ్బందిగా వుందతనికి, వాళ్ళు ఎందుకొచ్చారో కూడా అతనికి అర్థమయింది.

శాంతమ్మగారు కూడా పలకరించి వాళ్ళని కూర్చోబెట్టి లోపలికొచ్చి "ఎవరో వచ్చేరు. టిఫిను ఎక్కువగా చేయి" అని చెప్పి మళ్ళీ వాళ్ళదగ్గరకొచ్చి కూర్చుంది.

వచ్చినవాళ్లు ఎవరా అన్న ఆసక్తి మీరాకి లేదు. ఆవిడ చెప్పివెళ్ళినప్రకారం చేయసాగింది.

శేఖరం వాళ్ళతో మాట్లాడుతున్నాడేగాని అతని ధ్యాసంతా మీరామీదే వుంది. మీరాని చూస్తూనే సరోజినీదేవి ఆశ్చర్యంగా అవీ ఇవీ అడుగుతుంది. వాళ్ళింటి కెడుతుంది. తను వెళ్ళి మీరాని వాళ్ళు చూడకుండా వెళ్ళిపొమ్మన్నా బాగుండదు. తల్లికి సమాధానం చెప్పుకోవాలి. మీరా వాళ్ళని చూసి ఒక్కసారిగా కంగారు పడకుండా, చెప్తే మంచిదనిపించిందతనికి.

శాంతమ్మగారు అరుణకి ఆడపిల్ల అనీ, వెళ్ళి నాలుగురోజు లయిందనీ-ఇంకా అవీ ఇవీ చెప్తోంది.

శేఖరం లేచి లోపల కొచ్చేడు.